# ప్రజాజ్యోతి

నల్లగొండ-సూర్యాపేట
యాదాద్రి భువనగిరి

శనివారం | 25 | మే | 2024 పేజీలు: 7


## మహిళల రక్షణ కొరకు షీ టీమ్స్




7



# ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు

**సమస్యాత్మక కేంద్రాల్లో గట్టి నిఘా**

**అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు**

సూర్యాపేట కలెక్టరేట్,మే 24(ప్రజాజ్యోతి):జిల్లాలో శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యస్.పి.రాహుల్ హెగ్డే తో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసామని మహిళ ఓటర్లు 34176 మంది,పురుష ఓటర్లు 17321 మంది మొత్తం 51497 మంది ఉన్నారని తెలిపారు.అదేవిదంగా 16 రూట్లలో 71 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే 16 సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు.జిల్లాలోని 71 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపడుతున్నట్లు అలాగే 19 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో బయట కూడా వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు ..మిగతా 2లో

## శాసన మండలి ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు

# అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టబద్రుల ఉప ఎన్నికల సాధారణ పరిశీలకులు సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జ**



నల్లగొండ మే 24(ప్రజాజ్యోతి): ప్రతినిధి : సూక్ష్మ పరిశీలకులు శాసనమండలి ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు గమనించాలని శాసనమండలి ఉపఎన్నికల జిల్లా పరిశీలకులు, సీనియర్ ఐ ఏ ఎస్ అధికారి రాహుల్ బొజ్జ అన్నారు. శుక్రవారం నల్గొండ పట్టణంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో శాసనమండలి ఉపఎన్నిక పోలింగ్ పై సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పోలింగ్ జరుగుతున్న సందర్భంలో సూక్ష్మ పరిశీలకులు చేయాల్సిన విధులను, చేయకూడని పనులను తెలియజేస్తూ, ఎన్నికల కమిషన్ విధివిధానాలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ జరుగుతున్నది లేనిది ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన మాట్లాడుతూ శాసనమండలి పట్టబద్రుల ఉప ఎన్నికల పోలింగ్ లో భాగంగా ఏజెంట్ల హాజరు, బ్యాలెట్ ..మిగతా 2లో

## దేశవ్యాప్తంగా మోడీ.. పువ్వు.. అందరి నోట ఇదే మాట



2

## పట్టభద్రుల ఉప ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ముందు 48 గంటలు సైలెంట్ పిరియడ్

**ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి**

**జిల్లా ఎస్పి చందనా దీప్తి**

2





# ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు.అదేవిదంగా 22 పోలింగ్ కేంద్రాల్లో 800 మంది ఓటర్లు ఉండగా అట్టి చోట రెండు జంబో బాక్స్ లు ఏర్పాటు చేస్తున్నామని మిగతా చోట జంబో,బిగ్ సైజ్ బాక్స్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 26న పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకుంటారని 27న ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు.పోలింగ్ రోజున పోలింగ్ ఏజెంట్లను కేంద్రాలకు ముందుగా పంపాలని సూచించారు.అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని అలాగే తేదీ.25.5.2024 న సాయంత్రం 4.00 ల నుండి 27.5.2024 సాయంత్రం 4.00 వరకు జిల్లాలో మద్యం షాపులు పూర్తిగా బంద్ చేయాలని, సభలు, సమావేశాలు,ప్రచారాలు నిలిపివేయాలని తెలిపారు.ఎన్నికల రోజున జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు.పోలింగ్ అనంతరం కలెక్టరేట్ రిషప్షన్ సెంటర్లలో అందచేయడం తదుపరి కౌంటింగ్ నిమిత్తం నల్గొండ దుప్పలాపల్లి ఎఫ్.సి.ఐ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కి తరలించడం జరుగుతుందని అన్నారు.అనంతరం యస్.పి.రాహుల్ హెగ్డే మాట్లాడుతూ 19 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి నిఘా పెంచామని అలాగే 16 రూట్లలో గట్టి భద్రత ఏర్పాటు చేశామని ప్రతి మండలంలో సబ్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణ ఉంటుందని ఎక్కడకూడా ఎలాంటి సంఘటనలు జరుగకుండా పక్క ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.అంతకు ముందు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను తెలుసుకున్నారు.ఎన్నికల విధులు నిర్వహించే 242 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్.ప్రియాంక,బి.ఎస్.లత,అదనపు యస్.పి నాగేశ్వర రావు, ఎన్ని కల పర్యవేక్షకులు శ్రీనివాస రాజు,తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుండి టి.కరుణాకర్ రెడ్డి,బి.జె.పి. నుండి అబిడ్, బి.ఆర్.ఎస్ నుండి సత్యనారాయణ,సి.పి.ఎంనుండి కోటా గోపి,బి.ఎస్.పి నుండి స్టాలిన్,వై. సి.పి నుండి డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాసన మండలి ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి...

బాక్సల సీలింగ్ ప్రక్రియ, ఓటర్ ను గుర్తించే ప్రక్రియ, రహస్య ఓటింగ్ విధానం అన్ని విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, జిల్లా మీసేవ అధికారి రాజశేఖర్, మాస్టర్ ట్రైనర్స్ బాలు, గోపి లు పాల్గొన్నారు.



# దేశవ్యాప్తంగా మోడీ.. పువ్వు.. అందరి నోట ఇదే మాట

**శాసనమండలిలో పోరాడే సత్తా ఉన్న నాయకుడు ప్రేమేందర్ రెడ్డి**

**నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న నిబద్ధతగల నాయకుడు ప్రేమేందర్ రెడ్డి**



కోదాడ టౌన్ మే 24 ( ప్రజా జ్యోతి) : రాష్ట్రంలో గత 10ఏళ్లు గా రైతుల నిరుద్యోగుల, ఉద్యోగుల, మహిళల, కోసం పోరాడింది బిజెపి నాయకులేనని రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల కోసం జైలు కెళ్ళి లాఠీ దెబ్బలు తిన్నది తాను తన పార్టీ నాయకులేనని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలో వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టు బద్రుల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమ రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ఆయన మాట్లాడారు ఉద్యోగుల పి ఆర్ సి, డి ఏ లు 37 జీవో రద్దు కోసం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కోసం రైతులకు రైతుబంధు రెండు లక్షల రుణమాఫీ ధాన్యానికి 500 బోనస్ వీటి కోసం పోరాడింది కాంగ్రెస్ వాళ్లు కాదని బిజెపి నాయకులైన అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వర్గాల కోసం తాము పోరాటం చేస్తే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేశారన్నారు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు తనకు రాజకీయాల కంటే ధర్మమే ముఖ్యమని రాముని కించపరిచే వారికి ఓట్లు వేయవద్దని పిలుపునిచ్చారు బిజెపి కార్యకర్తలు అంతా రాముని వారసులమన్నారు. కెసిఆర్ మెడలు వంచి ప్రజల పక్షాన పోరాడింది తానేనన్నారు కెసిఆర్ కి తనంటే భయమని తనపై 109 కేసులు పెట్టించారన్నారు. హిందీ పేపర్ లీకేజీ చేయించానని కేసు పెట్టించడం హాస్యాస్పదమన్నారు. కెసిఆర్ చరిత్ర అంతా తెలుసునని కార్ లోన్ కట్టకపోతే బ్యాంకు వారు జప్తు చేయడానికి వచ్చారని గుర్తు చేశారు



# పట్టభద్రుల ఉప ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ముందు 48 గంటలు సైలెంట్ పిరియడ్

**ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి**

**జిల్లా ఎస్పి చందనా దీప్తి**



నల్లగొండ మే 24(ప్రజాజ్యోతి): ప్రతినిధి : వరంగల్ -ఖమ్మం -నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుటకొనుటకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, పోలింగ్ ముందు 48 గంటలు తేది 25-05-2024 సాయంత్రం 4 గంటల నుండి తేది 27-05-2024 పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ ఉంటుందని జిల్లా ఎస్పీ చందన దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు.సైలెన్స్ పీరియడ్ లో యం.ఎల్.సి ఎన్నికలకు సంబందించిన సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు లో ఉంటుందని, ఎవ్వరూ 5 గురి కంటే ఎక్కువ గుంపులుగా ఉండ కూడదని అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే నగదు, మద్యం,ఇతర వస్తువుల రవాణా పై మరింత పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎవరైన ఓటర్లను ఆకర్షించేందుకు ఉచిత పంపిణీలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన పిర్యాదులు సి.విజిల్ ఆప్ ద్వారా పిర్యాదు చేయగలరని అన్నారు. పోలింగ్ కు 48 గంటల ముందు నుండే ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు, ఇంటింటా ప్రచారం లాంటివి చేయవద్దని అన్నారు. వేరే నియోజక వర్గం నుండి ప్రచారానికి వచ్చిన వాళ్లు స్థానికంగా ఏవ్వరూ ఉండకూడదని, లాడ్జ్ లు, గెస్ట్ హౌస్ లు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు మరియు రాజకీయ పార్టీ ల వారు తేది 25-05-2024 సాయంత్రం 4 గంటల లోపు ఖాళీ చేసి వెళ్లిపోవాలని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు లేని వ్యక్తులు బసచేయడానికి వస్తే వారి గురించి సంబంధిత పోలీసులకు తెలియజేయాలి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున, పై నిబంధనలను ఏ పార్టీవారయిన, ఏ వ్యక్తులయిన ఉల్లంఘించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# ఈసెట్ ఫలితాలలో ప్రతిభ చాటిన జడ్పీహెచ్ఎస్ కొండమల్లేపల్లి పూర్వ విద్యార్థులు







కొండమల్లేపల్లి మే 24 ప్రజా జ్యోతి: కొండ మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2021 ఏప్రిల్ లో పదవ తరగతి ఉత్తీర్ణులై, పాలీసెట్ 2021లో ఉత్తమ ర్యాంకులు ,2024 ఈసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకుల ను సాధించిన కూరాకుల అశ్విని, ఉప్పునూతల స్వాతి, గాదగోని రమాదేవి లను కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితోపాధ్యాయుడు కొలనుపాక శ్రీపతి రావు అభినందించారు.వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కృషి, పట్టుదలకు ఈ ఫలితాలు నిదర్శనమని కరోనా మహమ్మారి విజృంభించిన కాలం, ప్రత్యక్ష తరగతులకు హాజరు కాలేనందున, జూమ్ ద్వారా క్లాస్ లు విని ఉత్తమ పాలిటెక్నిక్ రాంక్ లు సాధించారు.కృషి తో నాస్తి దుర్భిక్షం...విద్యార్థులందరికి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశ పరీక్ష కొరకు జూమ్ యాప్ ద్వారా ఆన్ లైన్ శిక్షణను గణితోపాధ్యాయుడు కొలనుపాక శ్రీపతి రావు అందిచారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నల్లగొండ లో డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ లో 2021 జులై లో ఈ విద్యార్థులు ప్రవేశం పొందారు. ఎంతో కష్టపడి పాలిటెక్నిక్ లో ఉత్తీర్ణులై ఉత్తమ గ్రేడులు పొందారు. అదే ఉత్సాహంతో పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఈ సెట్ 2024 ప్రవేశ పరీక్ష రాసి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు లు సాధించారు. కూరాకుల అశ్విని ర్యాంక్ 190, ఉప్పునూతల స్వాతి ర్యాంక్ 429,గాదగోని రమాదేవి ర్యాంక్ 1409 మొదటి ఇద్దరు విద్యార్థులకు అగ్రశ్రేణి 5 ఇంజనీరింగ్ కళాశాలల్లో, కన్వీనర్ కోటాలో కంప్యూటర్ సైన్స్ లో ప్రవేశం దొరుకుతుంది ఫీజు చెల్లించనవసరం లేదు. 3వ విద్యార్థికి కూడా అగ్రశ్రేణి ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో కంప్యూటర్ సైన్స్ లో ప్రవేశం దొరుకుతుంది. ఫీజు రీయింబర్స్మెంట్ పోగా మిగిలిన ఫీజు చెల్లించాలి. వీరంతా ఇంజనీరింగ్ కళాశాలల్లో డైరెక్ట్ గా 2వ సంవత్సర కోర్సు ప్రవేశం పొందుతారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

**ఎస్. వెంకన్న**
**మండల వ్యవసాయ అధికారి**



కొండ మల్లేపల్లి, మే 24 , ప్రజా జ్యోతి: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అందజేస్తే కఠిన చర్యలు తప్పవని కొండ మల్లేపల్లి మండల వ్యవసాయాధికారి ఎస్. వెంకన్న అన్నారు. శుక్రవారం కొండ మల్లేపల్లి పట్టణంలో పలు ఫర్టిలైజర్‌షాపులలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించరాదని ఆదేశించారు. లూజ్ విత్తనాలు ఎవరైనా అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులు కూడా ఎరువులు, విత్తనాలు కొన్న వెంటనే ఫర్టిలైజర్ షాపుల యజనుమాల నుంచి బిల్లులు పొందాలని, ఆ బిల్లులను పంటకాలం ముగిసే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. విత్తనాలు మొలకెత్తక రైతులు నష్టపోతే ఆ బిల్లుల ద్వారా నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆయా ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు, విత్తనాలకు స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. రోజూ ధరల పట్టికను బోర్డుపై రాసి ఉంచాలని, రోజువారీ విక్రయాల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులను మోసాలకు గురి చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రశీదుపై పూర్తి వివరాలతోపాటు విత్తనాలకు సంబంధించిన లాట్ నెంబర్, కొనుగోలు చేసిన రైతుపేరు, తండ్రిపేరు, ఊరుపేరు, ఫోన్‌నంబర్ నమోదుచేసి అందజేయాలని ఫర్టిలైజర్ షాపుల యజమానులకు సూచించారు.



## శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పరిశీలకులు రాహుల్ బొజ్జ సమక్షంలో పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ పూర్తి



నల్లగొండ మే 24(ప్రజాజ్యోతి): ప్రతినిధి : వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలతో పాటు,పోలింగ్ సిబ్బందికి భోజనం, బ్యాలెట్ బాక్సులు తరలించేందుకు వాహనాలు తదితర అన్ని విషయాలపై మరోసారి దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన వరంగల్- ఖమ్మం -నల్గొండ పట్టభద్రుల శాసన మండలిక పరిధిలోని జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలతో కోరారు. శుక్రవారం ఆమె వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పరిశీలకులు, ఐఎఎస్ అధికారి రాహుల్ బొజ్జ సమక్షంలో ఎన్నికల పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ శాసనమండలి ఉప ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్ లకు ప్రత్యేకంగా సరఫరా చేసే గుడ్డతో సీల్ చేసి క్లోజ్డ్ కంటైనర్లతో రిసెప్షన్ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.పోలైన బ్యాలెట్ బాక్సులు, ఫ్యాటీటరీ మెటీరియల్ తో సహా అన్ని 12 జిల్లాల నుండి నిర్దేశించిన సమయంలో నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని అని శెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ కు తీసుకురావాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తో పాటు, 12 జిల్లాల సహాయ రిటర్నింగ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎన్.హెచ్. ఆర్.సి. జిల్లా అధ్యక్షులుగా సగ్గు లక్ష్మణ్



రాజాపేట, మే 24 (ప్రజా జ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా రాజాపేట మండల కేంద్రానికి చెందిన ఉన్నత విద్యా వంతులు ,సామాజిక ఉద్యమకారులు సగ్గు లక్ష్మణ్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య నియామక పత్రం అందించారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ సంస్థ విధివిధానాలకు అనుగుణంగా జాతీయ రాష్ట్ర కమిటీ ఆదేశాలను అనుసరించి పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన సగ్గు లక్ష్మణ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జోనల్ కో కన్వీనర్ జంగిటి నరేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఉచిత శ్రీకాంత్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## సకాలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేయాలి - మున్సిపల్ కమిషనర్

మిర్యాలగూడ, మే 24,( ప్రజా జ్యోతి ): పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందేలా ఏజెన్సీలు కృషి చేయాలని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ ఎండి యూసుఫ్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం దుస్తులు కుట్టే పనులను మున్సిపల్ కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక ముత్తిరెడ్డికుంట కమ్యూనిటీ హాలులో కమిటీలోని స్వయం సహాయక సంఘాల మహిళలు దుస్తులు కుట్టే పనులను చేపట్టారు.వారి పనితీరును పరిశీలించి యూనిఫాం లను నాణ్యంగా ఎక్కువ కాలం మన్నేలా కుట్టాలని కోరారు . మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 4,225 మంది విద్యార్థుల కు సరిపడే దుస్తులను ప్రకాష్ నగర్, శాంతినగర్, ముత్తిరెడ్డికుంట కమ్యూనిటీ హాలులల్లో మహిళలు కుడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసి బక్కయ్య, సిఓ ఏం. శ్రీనివాస్ లున్నారు.

## కుర్రారంలో మాతమ్మ ఉత్సవాలు ముస్తాబు



రాజపేట, మే 24 (ప్రజా జ్యోతి) రాజపేట మండలం కుర్రరం గ్రామంలో మాతమ్మ పండుగకు ముస్తాబయింది. శనివారం ఉదయం 10 గంటలకు పోచమ్మ బోనాలు శనివారం సాయంత్రం విగ్రహ ఊరేగింపు ఆదివారం ఉదయం మాతమ్మ బోనాలు నాలుగు గంటలకు పటాలు తొక్కించుట మాతమ్మ మేకల గాగు పట్టుట బలిచ్చుట 10 గంటలకు వనభోజనాలు, సోమవారం రోజు ఎల్లం పండుగ, సోమవారం రోజు ఉదయం 10 గంటలకు పుట్టకముట సాయంత్రం 9 గంటలకు పుట్ట బంగారు కు వెళ్ళుట మంగళవారం రోజు పండగ కార్యక్రమాలు చేపట్టి వేషధారతో ఎల్లమ్మ కథ చెప్పడం జరుగుతుందన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ విధివిధానాలు నచ్చక దూరంగా ఉన్నా

**మదర్ డైరీ మాజీ డైరెక్టర్ ఆర్కల**

రాజాపేట, మే 24 (ప్రజా జ్యోతి) గత కొంత కాలం నుండి బిఆర్ఎస్ పార్టీ విధివిధానాలు నచ్చక దూరంగా ఉంటున్నానని మదర్ డైరీ మాజీ డైరెక్టర్ చల్లూరు గ్రామ సీనియర్ నాయకులు ఆర్కాల గాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం తనకు ఏ పార్టీతో సంబంధం లేదని, తరస్థంగా కొనసాగుతున్నట్లు వివరించారు. తన అనుచర వర్గంతో చర్చించిన తర్వాత త్వరలో తన రాజకీయ భవిష్యత్తును ప్రకటించనున్నట్లు గాల్ రెడ్డి చెప్పారు.



# గొర్రెల పంపిణీలో యాదవులకు అన్యాయం

గత ప్రభుత్వం డీడీలు కట్టించి
మోసం చేశారు...
ఇప్పటికైనా యాదవులకు
న్యాయం చేయాలి...
చిత్రియాలా యాదవ సంఘం
అధ్యక్షులు బందెల తిరుపతయ్య



దేవరకొండ, చందంపేట,మే 23(ప్రజా జ్యోతి ) నల్లగొండ జిల్లా చందంపేట మండలం గొర్రెల పంపిణీ పథకంలో గత ప్రభుత్వం యాదవులకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టడంతో చందంపేట మండలంలో ఉన్న యాదవులు అందరూ డిడి ల రూపంలో గత ప్రభుత్వం ఒక్క యూనిట్ ధర 43,750 డబ్బులు బ్యాంకులో వేయడం జరిగింది కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యాదవులకు గొర్రెల పంపిణీ కార్యక్రమం లేదని అధికారులు చెప్పడంతో శుక్రవారం రోజున చిత్రియాల గ్రామ గొర్రెల లబ్ధిదారులు చందంపేట మండలంలో ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం యాదవుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి గొర్రెలు ఇస్తానని చెప్పినందున మేమందరము అప్పులు తెచ్చి పుస్తెలతాడు బ్యాంకులో పెట్టి డబ్బులు కట్టామని రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ మేము కట్టిన డబ్బులకు ప్రభుత్వం ఆలోచన చేసి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఒక్క యూనిట్ ధర గత ప్రభుత్వం 1,75,000 రూపాయలు ప్రకటించిందో ప్రతి లబ్ధిదారునికి ఇవ్వాలని ఇప్పుడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మమ్మల్ని ఆదుకోవాలని చిత్రియాల గోపాలకృష్ణ ప్రాథమిక గొర్రెల సహకార సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బందెల తిరుపతికి వినతి పత్రం అందించారు అనంతరం తిరుపతయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టినప్పటికీ యాదవులకు అన్యాయం జరిగిందని చాలామంది డబ్బులు అప్పులు తెచ్చి డీడీలు కట్టారని రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ సీఎం గారి దృష్టికి తీసుకెళ్లాలని ప్రతి యాదవ కుటుంబ సభ్యుల్ని ఇప్పుడున్న ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఎల్లయ్య చంద్రయ్య రాములు సత్తయ్య లక్ష్మమ్మ సత్యమ్మ కృష్ణ సైదులు వెంకటయ్య తదితరులు ఉన్నారు



## తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి

మునగాల మే 24 (ప్రజా జ్యోతి): నల్గొండ,ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు భారీ విజయాన్ని అందిద్దామని, ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు  కృషి చేయాలని మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి తీన్మార్ మల్లన్న ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టభద్రులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ప్రజా గొంతుకను చట్టసభలో వినిపించేందుకు తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ చేద్దామని అన్నారు. ప్రతి గ్రామంలో కమిటీగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పట్టభద్రుల ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసర్ల కోటయ్య, మాజీ సర్పంచ్ చింతకాయల ఉపేందర్, శెట్టి గిరి, కొండ రామంజి, రషీద్, పంది జాను,తదితరులు పాల్గొన్నారు.

## మండల ఫీల్డ్ అసిస్టెంట్ల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



గరిడేపల్లి మే 24(ప్రజా జ్యోతి): మండల ఫీల్డ్ అసిస్టెంట్ల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ మీటింగ్ లో సంఘానికి కొత్త అధ్యక్షులని ఎన్నుకోవడం జరిగింది.మండల ఫీల్డ్ అసిస్టెంట్ అధ్యక్షురాలుగా షేక్ సైదాబీ(రంజాన్)ని,ఉపాధ్యక్షులుగా కే గోపినాథ్,మాతంగి స్వామిదాస్, కార్యదర్శిగా బచ్చలకూరి సతీష్, సహాయ కార్యదర్శిగా బి.పున్నం, కోశాధికారిగా టి.ధనలక్ష్మీ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికకు సహకరించిన మండల ఎంపిడిఓ కె వనజ,అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి(ఏపీఓ)రాయికింది సురేష్,ఫీల్డ్ అసిస్టెంట్లకు,ఎన్నికైన కమిటీ సభ్యులకు ప్రతీ ఒక్కరికి పేరుపేరునా నూతన అధ్యక్షురాలు షేక్ సైదాభి(రంజాన్) కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## పాలకులు మాదిగలకు రాజకీయ ప్రాదాన్యత కల్పించాలి

మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్

మిర్యాలగూడ, మే 24, ( ప్రజా జ్యోతి ): గత 30 సంవత్సరాలుగా మాదిగ లను అధికారానికి దూరం చేసి  వారిని అణచివేసే కుట్రలు చేశారని ఆర్థికంగా, సామాజికంగా,రాజకీయంగా దూరం చేశారని మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ ఆరోపించారు. శుక్రవారం  ఉమ్మడి జిల్లాల మాదిగ సంఘాల మహాకూటమి సమీక్ష సమావేశం మిర్యాలగూడ గాంధీభవన్లో మహాకూటమి నాయకులు పోలేపల్లి ఉదయ్ కుమార్,పోకల రవికుమార్, మంద శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశానికి పొకల కిరణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ లను,ఉప కులాల ప్రజలను పాలకులు రాజ్యాధికారానికి దూరం చేసి అనగదొక్కాలని చూస్తున్నారని అందుకే మాదిగ సంఘాల మహాకూటమి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో కులగణనను చేపట్టి జనాభా దామాషా ప్రకారం గా రిజర్వేషన్లు కేటాయించి ప్రకటించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న కోటి మంది మాదిగ ఉప కులాల ప్రజలను గౌరవించి నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా హక్కులు పొందేందుకు ప్రతి ఒక్కరూ మహాకూటమి పక్షాన నిలబడేందుకు గ్రామ మండల డివిజన్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.గత 30 సంవత్సరాలుగా రాజ్యాధికారానికి దూరంగా ఉన్న ప్రజలను చైతన్యం చేసుకొని సంక్షేమ పథకాలు పొందే విధంగా తమరు హక్కులు సాధించుకోవాలని తెలిపారు. మహా కూటమి చైర్మన్ గా ఎన్నుకోబడిన కిరణ్ ను మిర్యాలగూడ పక్షాన గజమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాహా కూటమి నాయకులు తలకొప్పుల సైదులు, ఉర రామకృష్ణ, గూడపూరి శ్రీను, పుట్ట జంగన్న, బి. సైదులు, గోసంగి శ్రీను, అలంపల్లి నాగేశ్వరరావు, పరంగి సురేష్, దైద రవి,బొంగరాల వెంకటయ్య,మంద శ్రీను,పోకల నాగయ్య, సైదులు వెంకన్న దైద రవి,మచ్చ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.




## కోదాడ జడ్చర్ల హైవేపై మరో ప్రమాదం

ఆగని రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండ మల్లేపల్లి, మే 24, ప్రజా జ్యోతి: కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి గ్రామశివారులోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి మరియు ఒకరికి గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెరిక శ్రీను తండ్రి ముత్యాలు వయసు (27 )వృత్తి తాపీ మేస్త్రి ఉట్లపల్లి గ్రామం పెద్దవూర మండలం  తాపీ మేస్త్రిగా పనిచేస్తూ చేస్తున్నాడు. తేదీ  24-5-2024 శుక్రవారం రోజున పెరిక శ్రీను మరియు అదే గ్రామానికి చెందిన చిలువల కనకయ్య తండ్రి సత్తయ్య అను ఇద్దరూ కలిసి శ్రీను యొక్క బైక్  %ఝా 05 ఖీఖ% 5031 నెంబర్ గల బైక్ పైన దేవరకొండకు పని మీద వెళ్లి పని అనంతరం తిరిగి తమ గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో మధ్యాహ్నం ఒకటి పది నిమిషాలకు చిన్న అడిశర్లపల్లి గ్రామ శివారులోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్ దగ్గర తమ గ్రామానికి వెళ్ళుటకు రోడ్డు దాటుతుండగా సాగర్ రోడ్డు వైపు వెళుతున్న మరొక బైక్ %ఝూ5ఖీ=%2158 నెంబర్  గల బైక్ ను నడుపు వ్యక్తి అతివేగంగా వచ్చి శ్రీను బైకును ఢీకొట్టగా శ్రీను తలకు మరియు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు అయి అక్కడికక్కడే చనిపోయినాడు. వెనక కూర్చున్న కనకయ్యకు కాలు విరిగినది, ఇట్టి ఘటనపై మృతుడి భార్య పెరిక అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

## పట్టభద్రుల ఎన్నికల్లో ఏనుగుల రాకేష్ రెడ్డికి

# మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి

**సుంకర అజయ్ కుమార్.**



మునగాల మే 24 (ప్రజాజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టబద్రుల శాసనమండలి ఉప ఎన్నికల్లో నిరుద్యోగుల గొంతుక ఉన్నత విద్యావేత్త ఏనుగుల రాకేష్ రెడ్డి గారికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు, మునగాల మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈనెల 27న పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి విద్యావేత్త నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి ఏనుగుల రాకేష్ రెడ్డికి పట్టభద్రులు మీ అమూల్యమైన ఓటును సీరియల్ నెంబర్ మూడులో మొదటి ప్రాధాన్యత ఓటుగా వేసి నిరుద్యోగుల గొంతుగా మండలి కి పంపించడానికి పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు, పెద్దల సభ అయిన శాసనమండలికి మేధావులు వివిధ రంగాల్లో నిష్ణాతులైన వ్యక్తులను మండలికి పంపించి ప్రజలకు అనుకూలమైన చట్టాలు రూపొందించడంలో మేధావులను చట్టసభలకు పంపించాలని విజ్ఞప్తి చేస్తూ ఈ ఎన్నికల్లో బ్లాక్మెయిలర్లు దందాలు నడిపే వాళ్ళు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వాళ్ళు రౌడీషీటర్లు పోటీ చేసి అక్రమార్గాలలో చట్టసభలకు ప్రవేశించి చట్టసభలను మలినం చేయటానికి తీన్మార్ మల్లన్న లాంటి బ్లాక్ మెయిలర్ ఈ ఎన్నికల్లో ముందుకు వస్తున్నారు.కావున విద్యావంతులైన ఓటర్లు ఆలోచించి మండల కి విద్యావంతుడైన రాకేష్ రెడ్డికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాము, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తొగర్ రమేష్,కార్యదర్శి ఎలక వెంకట్ రెడ్డి,ఆకుపాముల సింగల్ విండో చైర్మన్ రామిరెడ్డి,మునగాల గ్రామ శాఖ అధ్యక్షులు ఉడుం కృష్ణ,మండల ఉపాధ్యక్షులు నాగిరెడ్డి,మండల అధికార ప్రతినిధి ఎల్పి రామయ్య, ముకుందాపురం ఎంపీటీసీ రామకృష్ణ,దొంగరి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కాసర్ల రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపిద్దాం

**మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్**
**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు**
**దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి**




కొండ మల్లేపల్లి, మే 24, ప్రజా జ్యోతి: కొండ మల్లేపల్లి పట్టణ కేంద్రంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దూదిపాల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం కొండమల్లేపల్లి పట్టణంలోని మన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కో-ఆర్డినేటర్ అయిన మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ను గెలిపించాలి అని గెలిపించాలి అని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందాని, అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిపించుకోవడం వలన నిరుద్యోగ సమస్య తీరుతుంది అని వారు అన్నారు. ఈ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవడం వలన అటు కేంద్రంలో, ఇటు రాష్టంలో పదేండ్లు పాటు అధికారంలో ఉంది నిరుద్యోగులను నిండా ముంచిన బీజేపీ, బిఆర్ఎస్ పార్టీ పార్టీలను బుద్ధి చెప్పినట్లు అవుతుంది అని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దూదిపాల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారి టీ గెలిపించాలని పట్టభద్రులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమాన్ రెడ్డి, వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, జెడ్పీటీసి సలహాదారు పసునూరి యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎమ్.ఏ ఖైసర్ ఖాన్, ఎంపిటిసి రామావత్ జగన్ యక్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూడావత్ మంగ్యా నాయక్, జిల్లా నాయకులు మైనంపాటి అశ్విన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధు నాయక్, కొడిదాల వెంకటయ్య, చుండూరు వెంకటేశ్వర్లు, కందుల వెంకట్ రెడ్డి, పాండు నాయక్, చందా ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం

మునగాల మే 24 (ప్రజా జ్యోతి): మునగాల మండలం మాధవరం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటి రెడ్డి దంపతులు హాజరై కళ్యాణోత్సవం జరిపించినారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా జిల్లా అధ్యక్షులు ఆరే రామకృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు వికలాంగులకు తగిన సహాయ సహకారములు అందిస్తానని వారికి సమాజంలో తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని సీనియర్ సిటిజన్స్ ను మరియు వికలాంగులను వారి వారి కుటుంబాలు వారికి ఏ లోటు రాకుండా చూసుకోవాలని పిలుపునిచ్చినారు. నేడు వృద్ధులైన వారు నాడు మన కుటుంబాల కోసం ఎంతో కష్టపడి మనని పెంచి పోషించినారు. అలాంటి వృద్ధులను నేడు చిన్నచూపు చూడటం మంచిది కాదని , నేడు వారిని మంచిగా చూస్తే మనం కూడా రేపటి రోజు వృద్ధులమైతావ్ కనుక మన పిల్లలు మనని అదే విధంగా చూస్తారని గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సత్యాన్ని గ్రహించి వృద్ధులకు తగిన విధంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందని మరొక్కసారి పిలుపునిచ్చినారు.





# నెంబర్ ప్లేట్ లేని 30 వాహనాలు పట్టివేత, జరిమానా విధింపు

**ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ బాబు**

మిర్యాలగూడ, మే 24, ( ప్రజా జ్యోతి ): మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నెంబర్ ప్లేట్ లేని 30 వాహనాలను పట్టుకుని జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ బాబు తెలిపారు.జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదేశాల మేరకు పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, సైలెన్సర్ మార్చి శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న ద్విచక్ర వాహనాలను పట్టుకొని వాటిపై సుమారు 7000 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నజీర్, కానిస్టేబుల్ క్రాంతి, నాగరాజు,రాజు, బాలయ్య,కిరణ్, దయాకర్, అక్రమ్ లు పాల్గొన్నారు.

# పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

మునగాల మే 24 (ప్రజా జ్యోతి): మునగాల మండలం ముకుందాపురం గ్రామంలోని ఇందిరా అనాథ వృద్ధాశ్రమం లో శుక్రవారం నాడు హైద్రాబాద్ వాస్తవ్యులు సేకు మురళీకృష్ణ (బిఎస్ఎన్ఎల్ ఎజిఎం హైదరాబాద్)- లక్ష్మి సునంద దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారు పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆశ్రమం లోని వృద్దులకు అన్న దానం,అరటి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి



విజయమ్మ మాట్లాడుతూ పెళ్లి రోజు సందర్భంగా అన్న ప్రసాదం అందించిన మురళీ కృష్ణ లక్ష్మి సునంద లకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి,సెక్రెటరీ ఇమ్మడి సతీష్ బాబు, గౌరవ సలహాదారులు యస్ యస్ రావు,ఫౌండేషన్ సభ్యులు శ్రీపాల్ రెడ్డి, వెంపటి ప్రసాద్,ఆశ్రమ సిబ్బంది భవ్య పలువురు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డిఎంఎచ్ఓ

గరిడేపల్లి మే 24(ప్రజా జ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంఎచ్ఓ చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. డిప్యూటీ డిఎంఎచ్ఓ సందర్శించిన సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొందరు సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన సెలవు పెట్టకుండా ఆస్పత్రికి రాని సిబ్బందికి మెమోలు జారీ చేస్తామన్నారు.అనంతరం రికార్డులు తనిఖీ చేశారు.



## బీసీ రిజర్వేషన్లను పెంచకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించేది లేదన్నారు

### బీసీలకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తే పోరాటానికి సిద్ధమే అన్నారు

పెద్దవూర మే 24( ప్రజా జ్యోతి ) మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బిసి అధికార ప్రతినిధి రేపాకుల ఆంజనేయులు యాదవ్ బీసీల గురించి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగన చేపట్టాలి అన్నారు కులగన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జియో నెంబర్ 26 ను కావలసిన బడ్జెట్ ను విడుదల చేసిందని గుర్తు చేశారు రాష్ట్రంలో కులగణన చేపట్టి బిసి రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బీసీలను గణన చేయకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో బీసీ నేతలు పమనగండ్ల లాలు గౌడ్,వెంకటాచారి, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

# సీతా స్కూల్ మాయాజాలం

**అనుమతులు లేకుండానే చింతలపాలెం గ్రామపంచాయతీ పరిధిలో స్కూల్ రెండవ భవన నిర్మాణం**

**గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న టాక్స్ లు కట్టని వైనం**

**నోటీసులు జారీ చేస్తామంటున్న అధికారులు**

**ఆర్టీఐతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన స్కూల్ బాగోతం**






చింతలపాలెం మే 24 (ప్రజా జ్యోతి) :- మండల కేంద్రంలోని శ్రీమతి సీత మెమోరియల్ స్కూల్ యాజమాన్యం అనుమతులు లేకుండా రెండో భవనం నిర్మించి దాని ద్వారా స్కూల్ నిర్వహిస్తున్న సంఘటన ఆర్టీఐ ద్వారా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చింతపాలెం గ్రామస్తులు వీరంరెడ్డి సంజీవరెడ్డి రెండు నెలల క్రితం శ్రీమతి సీత మెమోరియల్ స్కూల్ అనుమతుల గురించి సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరడం జరిగింది. చింతలపాలెం గ్రామ పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రెండవ భవనం నిర్మించి అనంతరం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తయారు చేయించారని ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాల్లో కెళితే చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీమతి సీతా మెమోరియల్ స్కూల్ మొదటి భవనం నిర్మించి దాని ద్వారా స్కూల్ అనుమతులు పొందారు అనంతరం విద్యార్థుల సంఖ్య పెరగడం, దానికి అనుగుణంగా సెక్షన్ లు పెంచడం కోసం రెండవ భవనం నిర్మించారు, దీనికి గ్రామ పంచాయితీ నుండి ఎటువంటి అనుమతులు పొందలేదు, కొంత కాలం క్రిందట గ్రామస్తులు తక్కువ ఫీజుతో విద్యను అందించాలని ధర్నా చేపట్టారు, దీంతో అంజనీ సిమెంట్ ద్వారా సీత మెమరీ స్కూల్ నిర్వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని యాజమాన్యం అతి తెలివిగా వ్యవహరించి, అప్పటివరకు అంజని సిమెంట్ ఫ్యాక్టరీ ఎండి వెంకట రాజు పేరుతో ఉన్న స్కూల్ ల్యాండ్ లీజు కి ఇస్తున్నట్టు ప్రస్తుత ప్రిన్సిపాల్ థామస్ పేరు మీద లీజు డాక్యుమెంట్ తయారు చేయించారు, అంజనీ సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన స్కూల్ పరిసర ప్రాంతాల ప్రజలకు తక్కువ ఫీజుల తో విద్య అందించాల్సింది పోయి అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ చుట్టుపక్క గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బంది గురి చేస్తున్నారని చింతలపాలెం మండల ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా గత సంవత్సరం కూడా బస్సులు ఫిట్నెస్ లేకుండానే నడిపించారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి శ్రీమతి సీత మెమోరియల్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుకు సహకరించాలి

అనంతగిరి మే24( ప్రజా జ్యోతి): ప్రశ్నించే గొంతుకగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుకు సహకరించి శాసనమండలికి పంపించాలని పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, పట్టు భద్రులను కోరారు. గొంద్రియాల లక్కవరం గ్రామాలలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నల్గొండ వరంగల్ ఖమ్మం జిల్లాల పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఇండియా కూటమి అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేస్తుందన్నారు. రైతుకు రుణమాఫీని ఆగస్టు15 లోపు అమలు చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు.



బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి నిరుద్యోగులు ఉద్యోగులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ కు బిజెపిలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు.ఈ కార్యక్రమంలో కొండపల్లి వాసు,బుర్ర పుల్లారెడ్డి, దేగ కొండయ్య, బాబు నాయక్, బుర్ర నర్సిరెడ్డి, నాగుల్ మీరా, మందపల్లి వెంకటేశ్వర్లు, గొట్టేముక్కల శేషయ్య, నెల్లూరి ప్రభాకర్, నెల్లూరి వినయ్, ఏటుకూరి రమేష్, చు%శీ%చు మురళి, కలకొండ కోటేశ్వరరావు, దండమూడి రవి, ఏపూరి ముత్యాలరావు, బండ్ల పుల్లయ్య, కోడారు రాధాకృష్ణ, గంగూరి గంగయ్య, చెన్నుపాటి పుల్లయ్య, వివిధ హోదాలో ఉన్న మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలి

మునగాల మే 24 (ప్రజా జ్యోతి):విత్తనాల కొనుగోలులో రైతులు పాటించవలసిన జాగ్రత్తలలో భాగంగా గణపవరం మరియు తిమ్మారెడ్డి గూడెం గ్రామాల్లో రైతులు మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కె ముస్తఫా అవగాహన సదస్సు నిర్వహించారు దానిలో భాగంగా రైతులకు ఈ కింది సూచనలు సలహాలు ఇవ్వటం జరిగింది .

లైసెన్సు కలిగిన విత్తన డీలర్ల వద్దనే కొనుగోలు చేసుకోవాలి. ఇలా కొనడం ద్వారా ఒకవేళ పంటనష్టం జరిగినపుడు రైతులు వ్యవసాయ ఉన్నత అధికారులను సంప్రదించి ఆ డీలర్ ద్వారా కంపనీ నుండి నష్టపరిహారం పొందవచ్చు.

విత్తనాలు ఉన్న సంచులు సరైన పాకింగ్, సీలు మరియు లేబుల్ ధృవీకరణ పత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాలి.

విత్తన సంచులపై విత్తనరకం, ల్యాబ్ నంబర్, గడువు తేది తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేవో చూసుకొన్న తరువాత మాత్రమే కొనుగోలు చేసుకోవాలి.

విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత డీలర్ నుండి బిల్లుపై (రశీదు) సంతకం తీసుకోవాలి.

హైబ్రిడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విత్తనరకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపర

నాణ్యతను లేబుల్ మీద ఉన్నాయో లేదో గమనించి కొనుగోలు చేయాలి.

విత్తనాన్ని దుకాణదారుని నుండి కొనుగోలు చేసిన తర్వాత ఇంటివద్దనే రైతే స్వయంగా విత్తన మొలకశాతాన్ని (కనీసం 75 శాతం ఉండాలి) పరీక్షించుకున్న తర్వాత సంతృప్తికరంగా ఉంటే మాత్రమే పొలంలో విత్తుకోవాలి.

ఒకవేళ విత్తనంలో మొలకశాతం తక్కువగా ఉంటే కొనుగోలు చేసిన దుకాణదారుని దగ్గరకు తీసుకవెళ్లి పరిస్థితిని వివరించి ఆ విత్తనాలు ఇచ్చేసి వేరే విత్తనాన్ని తీసుకోవాలి.

విత్తనంలో గల లోపాన్ని వివరించిన తరువాత కూడా దుకాణదారుడు సరైన విధంగా విత్తనాన్ని మార్చి ఇవ్వకపోతే సదరు డీలర్పై వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధంగా చేసిన యెడల విత్తన పరిహారం పొందే హక్కు రైతులకు ఉంటుంది.



పంటకు నష్టం జరిగితే రైతుకు నష్ట పరిహారం రావాలి అంటే, పంట కాలం పూర్తయ్యే వరకు విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్రం, కొనుగోలు చేసిన బిల్లును (రశీదును) మరియు విత్తనపు సంచి/ బస్తాను జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.

పాకింగ్ లేని, సీల్ తీసి ఉన్న విత్తన సంచులు, పగిలిన విత్తన ప్యాకెట్లు, మూతలు తీసిన డబ్బాల్లోని విత్తనాన్ని కొనుగోలు చేయరాదు.

విత్తనాన్ని కొనుగోలు చేసే క్రమంలో విత్తన సంచి బరువు తక్కువగా అనిపిస్తే డీలర్ ముందు తూకం వేయించి తక్కువగా ఉన్న విత్తనాన్ని డీలర్కు ఇచ్చి కొత్త విత్తనాన్ని తీసుకోవాలి.

విత్తనాలను వాటిపై ముద్రించిన ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధర కి కొనకూడదు

తక్కువ ధరకే విత్తనాలు వస్తున్నాయి కదా అని పక్కనే ఉన్న రాష్ట్రాల నుండిగానీ, వాళ్ళు బిల్ ఇచ్చినా కూడా కొనుగోలు చేయకూడదు. ఒకవేళ ఏదైనా పంట నష్టం జరిగితే పక్కన రాష్ట్రాల నుండి రైతుకు ఎలాంటి నష్ట పరిహారం ఇప్పించడం కుదరదు.

విత్తన మొలకథలో, పూత థలో పంటల ఎదుగుదల సరిగా లేకపోతే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు తెలియచేసి క్షేత్రానికి తీసుకవెళ్ళి చూపించాలి.

విత్తనం ఎక్కడ తయారీ అయ్యిందో ఏ కంపెనీ వారు పంపిణీ చేసారో, విత్తనం అమ్మిన దుకాణదారుడి ద్వారా తెలుసుకోవాలి.

ప్రత్తి విత్తనాలు కొనేటప్పుడూ బీటీ-1 మరియు బీటీ-2 విత్తనాలకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది కాబట్టి వాటిని మాత్రమే కొనుగోలు చేయాలి.

బీటీ-3 లేదా రౌండప్ బీటీ విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదు కావున రైతులు ఎట్టి పరిస్తితుల్లో వాటిని కొనకూడదు. ఎవరైనా బీటీ-3 విత్తనాలు అమ్ముతున్నట్లయితే వ్యవసాయ శాఖ అధికారికి లేదా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలి. గ్రామాల్లో రాత్రి వేళల్లో, ఎలాంటి బిల్లులు లేకుండా, మధ్యవర్తుల ద్వారా వాహనాల్లో విత్తనాలను అమ్ముతున్నట్లుగా, ప్రయివేట్ వాహనాల్లో విత్తనాలను తరలిస్తున్నట్లు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారికి లేదా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలి.

ఒక రైతు ఎట్టి పరిస్తితుల్లో వేరే రైతు తెచ్చుకున్న విత్తనాలను లేదా బిల్ లేకుండా వేరే రైతు ఇచ్చిన విత్తనాలను లేదా బిల్ లేకుండా వేరే రైతు ద్వారా తెప్పించుకున్న విత్తనాలను తీసుకోవద్దు. ఏదైనా పంట నష్టం జరిగినప్పుడు ఈ రైతు పేరుతో బిల్ లేకపోవడం వలన ఈ రైతుకి నష్ట పరిహారం రాదు అని అన్నారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాలకు సంభందించిన రైతులు పాల్గొనటం జరిగింది .

# మహిళల రక్షణ కొరకు షీ టీమ్స్

**సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే.**




సూర్యాపేట జిల్లా ప్రతినిధి మే 24(ప్రజాజ్యోతి): సూర్యాపేట జిల్లా షీ టీం ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో షీ టీమ్స్,మరియు మహిళల భద్రత గురించి పోలీసు కళాభృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.షీ టీమ్స్ ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మహిళల భద్రత రక్షణ,మహిళలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను అధిగమించాలని సోషల్ మీడియా,ఇంటర్నెట్ ద్వారా జరిగే నేరాల పైన కూడా మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూర్యాపేట జిల్లా పోలీస్ ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణపై పటిష్టంగా పని చేస్తున్నామని,మహిళలు సమస్యలు ఉంటే షీ టీమ్స్ దృష్టికి మరియు 100 నెంబరుకి కాల్ చేసి తెలియజేయాలాన్నారు.మానసిక దైర్యం కలిగి ఉండాలని,అనుకూల,ప్రతికూల సమయాల్లో స్పందించేలా అవగాహన కలిగి ఉండాలని తెలిపినారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి,సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురికావద్దు, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా,ఏటీఎం కార్డ్ వివరాలు,ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దు. ఇతరులు ఆశ చూపితే వారి ఆకర్షితులు కావద్దు అని తెలిపినారు.మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కొరినారు.సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు.పోలీసు కళబృందం వారు సాంస్కృతిక,జానపద కార్యక్రమాలతో సామాజిక అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం నందు మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనువాసు,ఆర్ వో జ్ఞానేశ్వరి,టౌన్ మిషన్ కోఆర్డినేటర్ శ్వేత,సూర్యాపేట షీ టీం ఏఎస్ఐ సాలయ్య షీ టీం హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి,మహిళా సంఘాల ప్రతినిధులు మరియు కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపి,చారి, క్రిష్ణ,గురూలింగం, నాగర్జున పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించండి

**చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు పేర్వాల లక్ష్మణరావు**

చివ్వెంల మే 24(ప్రజాజ్యోతి):చివ్వెంల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన నల్లగొండ ఖమ్మం వరంగల్ జిల్లాల నుండి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి గెలుపును ప్రచారం చేస్తూ భారతీయ జనతా పార్టీ చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు పేర్వాల లక్ష్మణరావు ముఖ్య కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గుజ్జల ప్రేమేందర్ రెడ్డి ని శాసనమండలికి పంపించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని అతని పంపిస్తే శాసనమండలిలో నిరుద్యోగుల పక్షాన ఉద్యోగుల పక్షాన ప్రశ్నించే గొంతుగా ఉంటారని ఈ ఎన్నిక చారిత్రాత్మకమైనదిగా ఉండబోతుందిగా అని తెలిపారు.మే 27 తారీఖున జరగబోయే ఎన్నికలలో పోలింగ్ లో ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు విధిగా మొదటి ప్రాధాన్యత ఓటును గుజ్జాల ప్రేమ రెడ్డి పై క్రమ సంఖ్య ఒకటి అని వేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమాలు లో కిషన్,మోర్చా జిల్లా అధ్యక్షులు ధారావత్ శ్రీనివాస నాయక్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జంపాల వెంకటేశ్వర్లు,మండల నాయకులు మాధవరపు అనిల్ కుమార్,గ్రామ శాఖ అధ్యక్షులు చెన్నూరు వెంకటాచారి,ధారావత్ రఘు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కల సంరక్షణ మన అందరి బాధ్యత

**నర్సరీలలో అన్ని రకాల మొక్కలు పెంచాలి.**

**జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు.**

సూర్యాపేట కలెక్టరేట్,మే 24(ప్రజాజ్యోతి):మొక్కల సంరక్షణ మన బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు.శుక్రవారం స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్ లో వాటర్ డే సందర్భంగా ఇరువైపులా నాటిన మొక్కలకు అదనపు కలెక్టర్ సి.హెచ్.ప్రియాంకతో కలసి నీరు పోసారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్ల వలన వాతావరణం సమతులయంగా ఉంటుందని,వర్షాలు ఎక్కువగా పడే అవకాశాలు ఉంటాయని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని వాటి సంరక్షణ కూడా తీసుకోవాలని అన్నారు.వేసవి దృష్ట్యా మొక్కలు చనిపోకుండా రెండు పూటలు నీరు అందించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. తదుపరి బిబిగూడెంలో గల పట్టణ నర్సరీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీలో అన్ని రకాల మొక్కలు పెంచాలని ఎండలు దృష్ట్యా మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.నర్సరీలో గల మొక్కల వివరాలు తెలుసుకొని మరికొన్ని మొక్కల ప్రతిపాదనలు పంపాలని అలాగే ఇప్పటికే 60 వేల ఫ్రూట్ బేరింగ్ మొక్కలను తమిళనాడు నుండి తెప్పించడం జరిగిందని తెలిపారు. నర్సరీలలో పనిచేస్తున్న కూలీల చెల్లింపులపై అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి

**కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాజీ సర్పంచ్**

**వరకాంతం జంగారెడ్డి**



చౌటుప్పల్ మే 24 ( ప్రజా జ్యోతి ) పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వరకాంతం జంగారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మాజీ సర్పంచ్ వర్కల మహేందర్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు జక్క సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వరకాంతం జంగారెడ్డి, సురుగు శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. వారికీ కండువాలు కప్పి వరకాంతం జంగారెడ్డి, సురుగు శ్రీనివాస్ గౌడ్ లు కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్బంగా జంగారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు. దేశ, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఉప ఎన్నికలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

**పోలింగ్ కేంద్రాల్లో నిబద్ధతతో పనిచేయాలి.**

**జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎస్.వెంకట్రావు.**



సూర్యాపేట కలెక్టరేట్,మే 24(ప్రజాజ్యోతి):శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరగాలని ఆదిశగా మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 27 న జరిగే శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల తో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.ప్రియాంకతో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఆదిశగా ఎక్కడ కూడా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.పోలింగ్ రోజున చెక్ లిస్ట్ ప్రకారం ప్రతి అంశాన్ని పరిశీలించుకోవాలని అలాగే ఓటర్లు ఎక్కువగా ఎపిక్ కార్డులు వినియోగించుకునేలా చూడాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన 12 గుర్తింపు కార్డులు చూపి ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేల చూడాలని సూచించారు.జిల్లాలో 71 కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిలోని 22 కేంద్రాల్లో 800 మంది ఓటర్లు ఉన్నారని అట్టి చోట రెండు జంబో బాక్స్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపట్టనున్నట్లు సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి అంశాన్ని పి.ఓ డైరీలో నమోదు అయ్యేలా చూడాలని అదేవిదంగా సీలింగ్ ప్రాసెస్ ను నిచితంగా పరిశీలన చేయాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల కు 26న నియమించిన సిబ్బందితో కేంద్రాలకు వెళ్ళవలసి ఉంటుందని,ముఖ్యంగా ఎన్నికల్లో నియమించిన అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలని ఈ సందర్బంగా సూచించారు. తదుపరి మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలింగ్ రోజు చేపట్టే విధివిధానాలు వివరించారు.ఈ శిక్షణాకార్యక్రమంలో నోడల్ అధికారి ఏ.డి.ఏ శ్రీధర్ రెడ్డి, ఎల్.డి.ఎం. బాపూజీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, మాస్టర్ ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.